# అమ్మాయిగోరూ-
# అబ్బాయిగారూ!

"ఏమిట్రా సింహాద్రీ?..మీవూ రొచ్చిన మర్నాదే శుద్ధ'బోరు' కొట్టేస్తుంది?." వేసవి శెలవలకు బస్తీనుంచి కాలక్షేపం కోసం సర్దాగా పల్లెటూరు వచ్చిన కృష్ణ, పాలేరు కుఱ్ఱాడితో విసుగ్గా అన్నాడు.

"బోరంటే ఏటండబ్బాయిగోరూ?.." వట్టిగడ్డిని గొడ్ల దగ్గర వేస్తూ అడిగాడు సింహాద్రి.

"ఉహ్ !...అంటేనా...ఏమీ ఊసుపోకపోవడ మన్నమాట...ఏం తోచకపోవడం రా..."

"ఆట్టాగయితే నిన్నటికి మల్లె చేలోకి పోయి ముంజెలూ గట్టా తిందాం నడండబ్బాయిగోరూ !..."

"మంచోడివే!...నిన్న సాయంత్రం తిన్న ముంజెలన్నీ పొట్టలో పేరుకు పోయినియ్ రా ... రాత్రంతా తిన్నది అరక్క నిద్ర ఒహటిలేదు...చూస్తుంటే అసలుకే అజీర్తి చేసినట్టుంది..."

"పోనీ...సరదాగా కాలవగట్టుకేసి పోయి ఈత కొట్టుకుందాం రండి బాబూ!..."

"ప్చ్...ఆ ఈదటం మనకి రాదుగా.."

"నే నున్నానుగదు బాబూ...నేర్పించేదా ?..."

"ఒద్దులే ... ఛా ... ఈ మాయదారి పల్లెటూరికి రావడం శుద్ధ..."

"అట్టాగనకండోయ్.పోనీ సూడండి. గిత్త ఖాళీగా ఉన్నది...బండికట్టుకుని పోయి ఊరంతా సూద్దాం...నందయ్య గోరి సినేమా హాలు..."

"మీ వూళ్లో ఏముందిరా చూసేందుకు? ఆ సినేమా హాలు నీకు కొత్తగాని... పోనీ, చూడు సింహాద్రీ ... ఇవ్వాళ సర్దాగా నేను బండి తోల్తాను ...... ఏమంటావ్ ?"

"ఏటండోయ్ కిష్ణబాబుగారూ ! బస్తీలో యింత పెద్ద సదువు సదివి,

అందే గోపాలకృష్ణమూర్తి

పొడుగు లాగూ యేసుకున్న మీ బోటోరు బండి తోల్తుంటే...''

"పోనీ ఈ పొడుగు లాగూ, పొడుగు చొక్కా విప్పేసి నీలాగే పంచె, బనీను, తలగుడ్డ కట్టుకుంటాను...'' సింహాద్రి మాటకు అడ్డుతగిలి అన్నాడు కృష్ణ.

''మా భలే మాటాడ్తారండి కిష్ణబాబు గారూ !...'' కృష్ణ సరదాగా అలాగ అంటున్నా డనుకుని అన్నాడు సింహాద్రి.

"చప్...చూడు...ఐదు నిమిషాల్లో తయారై పోతా......నువ్వు బండి కట్టి రెడీగా ఉండాలి..." అంటూ షర్టు, పాంటు విప్పేసి, పంచెకట్టి, తలకి తువ్వాలు చుట్టబెట్టుకొని, మూలనపడున్న కిర్రు చెప్పులను వేసుకుని బండి దగ్గర కొచ్చి నిల బడ్డాడు కృష్ణ.

"అహ్హహ్హా...మా భలేగుండారండి కిష్ణబాబుగారూ !...అచ్చు మా పెదకాపు గోరి పాలేరులాగుండారు...'' కృష్ణ వేషం చూసి నవ్వుతూ అన్నాడు సింహాద్రి.

"మరేమనుకున్నావ్ ?...చూడు... లోపలి కెళ్ళి అమ్మగారితోను, చెల్లెమ్మ గారితోను నేనలా సినేమా హాలు దగ్గర కెడుతున్నానని చెప్పి రెండడుగుల్లో వచ్చేయ్...ఆ సందు మొదట్లో బండి ఆపుతాను..." అంటూ బండిని ముందుకు పోనిచ్చాడు కృష్ణ.

* * *

"అబ్బాయిగోరూ ! ఈ కాలవ గట్టు మీద బండిని మీరు తోల్లేరండి ... మీరా పక్కన కూచోండి..."

"ఓరి సింవ్వాద్రి...అందాకా నన్నలా పిలవకురా ! 'హోయ్ కిష్టయ్యోయ్...' అని పిలుసుకో..." 'సింహాద్రి మార్కు భాష'లో మాట్లాడుతూ అన్నాడు కృష్ణ

"మా భలేవోరండో కిష్టయ్యగారో!.." అంటూ బండి వేగాన్ని హెచ్చించాడు సింహాద్రి.

కాలువ గట్టుమీదుగా కుదుపుతో పోతున్న బండిలో సింహాద్రికి ప్రక్కగా కూర్చుని పల్లెటూరి వాతావరణాన్ని చూసి ఆనందిస్తున్నాడు కృష్ణ.

"ఏటండి కిష్టయ్యగోరూ ! ఆలోసిస్తుండారు ?" ప్రారంభించాడు సింహాద్రి.

"ఒరేయ్ సింవ్వాద్రీ. .బండి నే దోల్తా గాని, మీ పల్లెటూరి పాటొకటి పాడ కూడ దట్రా?...'' సింహాద్రి స్థానంలో తను కూర్చుంటూ అడిగాడు కిష్టయ్య.'

"ఓ ... దానికేముండాది బాబూ... దంచికొట్టేస్తాను..అయితే వినుకోండి.." అంటూ గొంతెత్తి పాట ప్రారంభించాడు సింహాద్రి.

"...ఓ...ఓ...హోయ్..కాంతమ్మో .
బండెల్లిపోతుంది...
హోయ్...సూరికాంతమ్మో...
బండెల్లిపోతుంది...
కాంతమ్మ కూతురూ...
బండిమీదున్నాది...

కాంతమ్మ అల్లుడూ...

బండి దోల్తున్నాడు...

హోయ్...కాంతమ్మో...

బండెల్లిపోతుంది...

ఇల్లుతాకె ట్టెట్టి...

పెళ్ళిచేసింది...

చేలు తాక ట్టెట్టి...

సారె పెట్టింది...

బొట్టు చీరా పెట్టి...

సాగనంపింది...

హోయ్...కాంతమ్మో...

బండెల్లిపోతుంది...

కాంతమ్మ కూతురూ...

బండిమీ దున్నాది...''

''ఓరి సింవ్వాద్రీ...యేదిరా బండిలో కాంతమ్మ కూతురు'' పాటను మధ్యలో ఆపుతూ అన్నాడు కిష్టయ్య.

"అది పాటండి కిష్టయ్యగోరూ!... నిజంగా కాంతమ్మ కూతురుంటాదేటసలు? సూడండి ... అల్లదుగో ... మీరొచ్చేరు నిన్న...టేషను...నడండటుకేసి పోయి నాయుడోరి పొలమ్మీంచి అమ్మోరి గుడి వైపెడదాం ... '' అంటూ బండిని ట్టేషను వైపుకు పట్టించాడు సింహాద్రి.

* * *

''హుఁ ... కు గ్రామం !! ఛా... ఒక్క రిక్షాయైనా...అధమం ఓ ఒంటెద్దు బండైనా ... లేదేమిటి? ... అయినా పాలేరును ట్టేషనుకి పంపమని ఉత్తరం వ్రాస్తే, ఎవరూ రాకపోతే అర్థమేమిటి?" 'ఎయిర్‌బ్యాగ్'ని భుజాన్ని వేసుకుని, సూట్‌కేసును చేత్తో పట్టుకుని పది నిము షాలనుంచి ట్టేషను ఆవరణలో బండి కోసం నిరీక్షిస్తున్న 'శారద' చిరాగ్గా విసుక్కుంటూ అటూ యిటూ చూడ నారంభించింది.

"అరె ... ఆ వైపునుంచేదో బండి వస్తున్నట్టుందే..మన పాలేరుదేనేమో." అనుకుంటూ ఆశగా అటువైపు చూస్తూ నిలుచుంది శారద

* * *

"వోరి సింవ్వాద్రి ... సూడు ... యెవరో అమ్మాయిగోరు! ... బండి కోసరం నుంచున్నారు గామోసు ... కడదామా?"

''ఓ...నడండి బాబూ!...యివ్వాళ మన గిత్తకి మేతడబ్బు లొచ్చేస్తయ్.." కృష్ణ అభిప్రాయాన్ని అర్థం చేసుకో లేని సింహాద్రి ధనాశచేత 'ఊఁ' కొట్టాడు.

''ఏటండమ్మాయి గోరూ! బండొచ్చేదా?...'' హుషారుగా అడిగాడు బండి తోల్తున్న కుర్రాడు.

''పోనీ...ఇందులోనే వెడదాం..." బండి తమ పాలేరుది కాదని నిరుత్సాహ పడిన శారద సమయానికి అదైనా కనపడి నందుకు సంతోషపడింది.

"ప్రెసిడెంటు గారిల్లు తెలుసా?'' అడిగింది శారద.

"ఆయనిల్లు తెలీపోతే యింకేటమ్మా?" బండి నాపిన కిష్టయ్య ఆదేశానుసారం సింహాద్రి శారద దగ్గర సూట్‌కేసు నందుకున్నాడు.

"ఈ బండిగాని ఇటు రాకపోతే మన పని ఎలాగుండేదో!'' అనుకుంటూ బండెక్కింది శారద.

"ప్రెసిడెంటుగోరు మనకేమౌతా రమ్మాయిగోరూ?'' సంభాషణ ప్రారంభించాడు కిష్టయ్య బండిని పోనిస్తూ.

"...ఆయనా? మా పెదనాన్న గారోయ్...'' ఆ వాతావరణంలో ఎలా మసలుకోవాలో తెలిసి ఉండటంచేత మామూలుగా జవాబిచ్చింది శారద.

''మనదేవూ రమ్మాయిగోరూ?..." మళ్ళీ అడిగాడు కిష్టయ్య.

"రాజమండ్రీ...''

"హో...యిప్పుడొచ్చిన పాలబండి రాజమండ్రం నుంచేనన్న మాటరోయ్ సింహ్వాద్రీ..." వెనక్కు తిరిగి ప్రక్కనున్న సింహాద్రితో అంటున్న కిష్టయ్య మాటలుఅదోలా అనిపించినయ్ శారదకు.

''ఆఁ...ఆఁ...అట్టాగే ఆనందం డోయ్ కిష్టయ్యగోరూ! ... సూడండీ... ఊసిపోయేందుకు యిందాకటి పాటగాని యిప్పుడు పాడమన్నారా?..." సర్దాగా నవ్వుతూ అడిగాడు సింహాద్రి.

"ఓయబ్బో...అదింటే అమ్మాయి గోరు అగ్గిఫైరై పోరూ? ... సూడండమ్మాయిగోరూ ... యేమైనా సదూకుంటున్నారా?...'' సంభాషణను ఎలాగైనా పొడిగిద్దామని అడిగాడు కిష్టయ్య.

"ఆఁ..." బండిలోంచి బయటకు చూస్తూ పరాగ్గా అన్నది శారద.

"ఓ యెనిమిదో కళాసుదాకా సదివేరనుకుంటాను..." అమాయకంగా అన్నాడు కిష్టయ్య.

"ఉహుహూఁ...భలే...కాదోయ్... నేను...బియ్యేస్సీ... అంటే...ఊఁ... పదిహేనో కళాసన్నమాట ... చదువుతున్నాను." వస్తున్న నవ్వును రుమాల్లో దాచుకుంటూ అన్నది శారద.

"అమ్మబాబోయ్! అంత సదూ సదుంకుని యేం చేస్తారమ్మాయిగోరూ?.' ఆశ్చర్యపోతున్నట్టు మొహం పెట్టి అన్నాడు కిష్టయ్య.

"ఏముందీ! ... ఉట్టినే ... సరదాగా చదువుకుంటున్నాను..."

"... నేనూ సిన్నప్పుడు మూడో కళాసుదాకా సదూకున్నానమ్మాయిగోరూ!...నాకు సదూకున్నోరంటే చానా యిష్టమండి..."

''మరయితే ఇంకా బాగా చదువుకుని ఈ బండితోలే బదులు బస్తీలో ఉద్యోగం చేసుకోలేక పోయావా?..." 'సరదాగా మాట్లాడుతున్న కిష్టయ్య కాలక్షేపానికి భలే పనికొస్తాడు' అనుకుంటూ అడిగింది శారద.

''ఏం చెయ్యమంటారండీ! ... సదూసెప్పమంటే యిస్కూలు బడి

పంతులు అయిదు రూపాయిలు యిమ్మంటాడు. ఇంకేం సదూతాం సెప్పండమ్మాయిగోరూ !...'' పట్టిపట్టి మాట్లాడేడు కిష్టయ్య.

"ఏం ?... నీకు చదువుకోవాలనుందా ?..." ఉత్సాహంగా అడిగింది శారద.

"పూ చెడ్డయిదిగా ఉందండమ్మాయిగోరూ !... సెప్పే వాళ్ళెవరూ లేరుగాని..." ఉదాసీనంగా అన్నాడు కిష్టయ్య.

"...చూడు...నీపేరేమిటన్నావ్... కిష్టయ్య గదూ ?..."

"భలేభలే...అది మీకెలా ఎరుకయ్యిందమ్మాయిగోరూ ?''

''మరి... ఇతని పేరు సింహాద్రి కదూ ?"

"ఓయబ్బో... ఎట్టా కనిపెట్టేసేరండోయ్ ?'' అరువు తెచ్చుకున్న ఆశ్చర్యంతో అన్నాడు కిష్టయ్య. అదంతా అమాయకత్వంగా లెక్క కట్టుకున్నది శారద.

"చూడు కిష్టయ్యా ... ఇందాక మీరిద్దరూ మాట్లాడుకుంటున్నప్పుడు ఒకళ్ళనొకళ్ళు పిల్చుకున్నారుగదూ..."

''అమ్మాయిగోరు మా చెడ్డ తెలివైనోరు...'' కళ్ళతోబాటు తల కూడా తిప్పుతూ అన్నాడు కిష్టయ్య.

''అబ్బాయిగోరు మా భలే ఆట కడ్తున్నారు." ఇంకొసారి అనుకున్నాడు సింహాద్రి



"ఏమయ్యా ! 420, నే చెప్పినతని అడ్రస్ కనుక్కొచ్చావా అంట....?"
"అందుకనే సార్ ! నే వెళ్ళేసరికి అతగాడు ఆ డ్రెస్ లేకుండా గైర్‌హాజరయ్యాడని.... అదే మీకు చెప్పాలని..."

---

"అయితే చూడవోయ్ కిష్టయ్యా... నీకు చదువుకోవాలనుందన్నావ్ గదూ... రేపటి నుంచి ఇంకో ఇద్దరు ముగ్గురుతో కలసి ప్రెసిడెంటుగారింటికి రాకూడదూ? సర్దాగా చదువు నేర్పుతాను ?..." నిరక్షరాస్యతను దూరంగా పారద్రోలాలని చిన్నప్పుడు శారదకొక చిన్న ఆశయముండేదిట. 'అందుకు అనుకూల పరిస్థితి ఏర్పడే సూచనలు కన్పడుతున్నయ్ గదా' అనే అభిప్రాయంతో అన్నది శారద.

"ఓల్ రైటుగా నండమ్మాయిగోరూ.. మీరూరికే సదూ నేర్పిస్తే, రోజూ మిమ్మల్ని బండెక్కించి మా ఊరంతా తిప్పుతానండోయ్...యేరా సింవ్వాద్రీ... మనిద్రం యెడదారేంటి ?'' సింహాద్రి

వైపు కళ్ళతో సంజ్ఞచేస్తూ అన్నాడు కిష్టయ్య. ఆ మాటలు విన్న శారదకు పల్లెటూరి ప్రజలంటే ఎంతో అభిమానం కల్గింది– "అబ్బ...ఈ పల్లెటూరి వాళ్ళవి ఎంతమంచి హృదయాలు! కుళ్ళు, కల్మషం లేని అమాయకమైన మాటలతో పూర్వ పరిచయం లేని వారిచేత కూడ ఎంత తొందరలో ఆకర్షింప బడతారు!!... అవే మాటలుగాని పట్నంలో ఓ కాలేజ్ స్టూడెంటు తనతోగాని అనుంటే ?... ఛా !..ఎంత అసభ్యకరంగా ఉంటుంది? . ఆ మాటలే ఈ పల్లెటూరి బండివాడి నోటి లోంచి వెలువడితే వాటిలో ఎంత అమాయకత్వం వ్యక్తమౌతున్నది !!''

"యేంటండమ్మాయి గోరూ ! ఆలో సిస్తుండారు ?...డబ్బిచ్చుకోకుండా సదూ సెప్పరేటండీ ?" ప్రశ్నించాడు కిష్టయ్య.

"అబ్బే...లేదోయ్...అదేంకాదు... రేపటినుంచి మీ రిద్దరూ తప్పకుండా రండి...ఊఁ(..?...నేనీ వూరు విడచి వెళ్ళేసరికి మీకు పుస్తకం చదవటం నేర్పి తీరుతాను..." ఆశయ సిద్ధికై కంకణం కట్టిన ధోరణిలో అన్నది శారద.

"మీరు భలే ఘంచి అమ్మాయిగోరండి!...మీలాంటోరుంటే మన దేశం యెంతో బాగుపడి పోతుందండి ... కదండమ్మాయి గోరూ ?...''

"సరేగాని ... నువ్వు బాగా చదువు కుంటే ... ఎలాంటి ఉద్యోగం చేయాల నుంది ?" తనను పొగిడే డ్రైరక్షన్‌నుంచి అతని దృష్టిని మళ్ళిద్దామని అడిగింది శారద.

"ఏముందండీ !...బస్తీలో మీలాటోరింటి కాడ యేదో జవాను పని చేసుకుంటాను...సదూ సెప్పిన మీరు యేదో నౌఖరీ యిప్పిస్తారు గదమ్మాయిగోరూ?"

...అరగంట తర్వాత బండి ప్రెసిడెంటు గారింటి ధగ్గర ఆగింది. బంధువుల పలకరింతల్లో కలసిపోయిన శారద, కిష్టయ్య కివ్వవలసిన 'బాడుగ' మాట మరచి పోయింది. 'అమ్మాయిగోరు' లోనికెళ్ళేసరికి, సింహాద్రి డబ్బుల కోసం అనుసరించబోయేడు.

"సదూనేర్చుకుందుకు రేపు మాపిటి కొచ్చేస్తానండమ్మాయిగోరూ !..." ఓ కేకవేసి, నవ్వుకుంటూ తిరుగు ప్రమాణం కట్టాడు కిష్టయ్య, సింహాద్రితో సహా !

*　　*　　*

"ఏమోయ్ పెద్దమ్మకొడుకూ ! ఇప్పటిదాకా ఏంచేశావ్ ?" సింహాద్రికి బండి వప్పజెప్పి వీధిగదిలోకివెళ్ళి బట్టలు మార్చుకుని బయటికొస్తున్న కృష్ణ నడిగింది పిన్నిగారమ్మాయి ఉమ.

"మీ మహానగరంలో ఇవ్వాళ నాకు భలే కాలక్షేపమయిందనుకో...ఆహా ! ఆ కాలువగట్టూ ... ఆ పరుగిడుతున్న నీరూ !... ఆ చల్లని పిల్లవాయువులూ.. మనస్సులో మధురానుభూతులు రేపే ఆ..."

"బ్‌ బస్ బస్ ... నీకు కవిత్వం వచ్చునేసి ఈ మధ్య పత్రికల్లో చదివేస్లే.. కాళ్ళు కడుక్కుని భోజనానికి సిద్ధపడు." వేళాకోళంగా అన్నది ఉమ.

"ఇదిగో ఉప్మా! నే నసలకే మంచి వాణ్ణికాను...నాతో అనవసరంగా ... మరి ... ఊం ... గొడవ పెట్టుకో వద్దు... తెల్సా?..." గారాబంగా అన్నాడు కృష్ణ.

"చెప్పేరు ... ఇకనడవండి..." అంటూ కృష్ణకి తువ్వాలు అందిచ్చింది ఉమ.

* * *

కొత్తపలకా, బలపం పుచ్చుకుని మర్నాడు సింహాద్రితోసహా ప్రత్యక్ష మయ్యాడు కిష్టయ్య ప్రెసిడెంటుగారి పెరట్లో...

"ఏమోయ్...నిన్నబండికి డబ్బులు పుచ్చుకోకుండా వెళ్ళిపోయావ్?" అడిగింది శారద.

"...సదూనేర్పుతారుగదండీ!..." అంటూ వినయంగా పలకవైపు చూశాడు కిష్టయ్య.

"ఏదీ...కొత్తపలకేమిటి?... మరి నీకేదోయ్ సింహాద్రీ..."

"మా కిష్టయ్యగోరు నేర్చుకుండాక యింటికాడ నాకు నేర్పిస్తానన్నారం డమ్మాయిగోరూ!" కిష్టయ్యవైపు ఒకా సారి, శారదవైపు ఓసారి చూస్తూ అన్నాడు సింహాద్రి.

శారద వ్రాసిచ్చిన అక్షరాల్ని, వర్ణ క్రమాలను అయిదు నిముషాల్లో చూడ కుండా వ్రాసేసేడు కిష్టయ్య.

"భలే తెలివైనోడివోయ్...నీలాంటి వాడు చదువుకుంటే చాలా బాగా రాణిస్తాడు..." కిష్టయ్య 'ఏక సంథా గ్రాహి' అనుకుంటూ ఓ రిమార్కు పాస్ చేసింది శారద.

"యేదోలెం డమ్మాయిగోరూ! ... సూడండి... యీ తెలుగుమాటలకేటి గానండి, ఓ నాలుగింగిళీషు ముక్కలు నేర్పిద్దురూ!..."

"నీ కప్పుడే ఇంగ్లీషెందుకోయ్... పూర్తిగా తెలుగు చదవటం రానీయ్ మరి..."

"అబ్బే...నాకో రెండు ఇంగిళీషు ముక్కలొచ్చునండమ్మాయిగోరూ!"

"ఏవీ... మాట్లాడు చూద్దాం..." ఉత్సాహంగా నవ్వుతూ కిష్టయ్య మొఖం లోకి చూస్తూ అన్నది శారద.

"ఏ బీ సీ డీ యఫ్...... మా తాత గుండూ టప్..." కిష్టయ్య ఇంగ్లీషులో మాట్లాడేసరికి గలగల మన్నది శారద. శారద నవ్వు విన్న కిష్టయ్య, శారద నిలబడినచోట నేలమీద ఏదో వెదక నారంభించాడు.

"ఏమిటోయ్... వెదుకుతున్నావ్?" ఏమీ అర్థంకానట్లు చూస్తూ అడిగింది శారద.

"హిహీహీ...మీలాటి అందమైనోరు నవ్వితే నవరత్నాలు రాల్తయ్యని సినేమాలో సూపెట్టేడండమ్మాయిగోరూ! అందుకని యేమైనా..."

కిష్టయ్య చమత్కారానికి అంటున్నాడో, అమాయకంగా అంటున్నాడో అర్థం చేసుకోలేకపోయింది శారద.

"...మంచివాడివే... రత్నాలుగాని అలా నవ్వినంతలోనే రాలితే... మన దేశానికీ కరువెందుకు ?... ఈ పంచవర్ష ప్రణాళిక లెందుకు ?..."

"అదేటండో ... యేదో కొత్త మాటాడినారు ?..." అడిగాడు కిష్టయ్య.

పంచవర్షప్రణాళికలను గురించీ, వాటి లాభాలను గురించీ ఏకధాటిగా చెప్ప నారంభించింది శారద. లోపల విసుగ్గా ఉన్నా పైకిమాత్రం ఎంతో వినయంగా, ఉత్సాహంగా వింటున్నట్టు నటిస్తూ. శారద కళ్ళల్లోకి అలా... చూస్తూ కూర్చుండి పోయాడు కిష్టయ్య.

'ఎందుకొచ్చిన గొడవరా నాయనా' అన్నట్టు చూస్తూ అటువైపు తిరిగి కూర్చున్నాడు సింహాద్రి.

అరగంట తర్వాత ముగించింది శారద ... "అదన్నమాటోయ్...... అందుకే అందరూ చదువుకోవాలి...సరే ...మళ్ళీ మీరు ఎల్లుండి రండి...ఊఁ?" అన్నది శారద.

"అదేంటండో ... మరి రేపో ?" రేపుగాని శారద దర్శనం దొరకదేమో నని లోపల విచారపడుతూ బయటికి మాత్రం చదువంటే ఎంతో ఇష్టమున్నట్టు మొహంపెట్టి అడిగాడు కిష్టయ్య.

"అబ్బే.... రేపు నాకు కొద్దిగా పనుంది...అలా ఊళ్ళో స్నేహితులింటి కెళ్ళాలి ... మళ్ళీ మీరు ఎల్లుండి వచ్చేయండి......"

"పోనీ బండి తెచ్చేదాండమ్మాయి గోరూ ?" చేతులు నలుపుకుంటూ అడిగాడు కిష్టయ్య.

"అబ్బే... అక్కర్లేదోయ్......" ముక్తసరిగా అన్నది శారద.

"మంచి దమ్మాయిగోరూ ! దండా లండో !..." అంటూ బయల్దేరాడు కిష్టయ్య.

"ఏ కోశానా కల్మష మనేది లేదీ పల్లెటూరి ప్రజల్లో..." గట్టిగా నిశ్చయించుకున్నది శారద.

* * *

"ఉమ ఉన్నదాండీ ?"—నీటుగా డ్రస్ చేస్కుకుని వీధిగుమ్మంలో వెనుకకు తిరిగి నుంచుని లోపలివాళ్ళతో మాట్లాడుతున్న కృష్ణని అడిగిందో అమృతంలాంటి కంఠం.

చటుక్కున వెనుకకు తిరిగాడు కృష్ణ. "అరె!...ఎవరిది !!... శారద !!!... శారదేమిటి, తన పిన్నికూతురుకోసం రావడమేమిటి ?... వీళ్ళిద్దరికీ అసలెలా పరిచయం ?......" ఇంకా ఎక్కువ ఆశ్చర్యపోతూ నోరు వదిలేయటానికి

అవకాశమివ్వకుండా. కృష్ణవైపు తమా షాగా చూస్తూ మళ్ళీ అదే ప్రశ్న అడిగింది శారద.

"ఆఁ... ఆఁ... ఆఁ... రండి... కూర్చోండి'' తడబడుతూ శారదను లోపలి కాహ్వానించి ఉమను గట్టిగా పిల్చాడు కృష్ణ

"ఏమిటోయ్ పెద్దమ్మకొడుకూ '... ఎందుకలా పీకకోసిన మేకలా అరుస్తావ్?..." అంటూ వచ్చింది ఉమ

"హేయ్, ఉమ్మీ ... నేనే ... ' హుషారుగ కుర్చీలోంచి లేస్తూ అన్నది శారద.

"హాయ్, శారూ!ఎప్పుడొచ్చేవ్?... ఎంతసేపైంది?...ఏమిటి సంగతి?..." గబగబా ఇంకా ఏవేవో అవే మార్కు ప్రశ్నలడుగుతున్న ఉమ మాటల సందడిలో పెద్దమ్మకొడుకు సంగతి మర్చిపోయింది

ఓ పదినిముషాల తర్వాత 'ఆయనెవరే' అనడిగింది గామోసు శారద అయోమయంగా ఓ మూలన కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్న కృష్ణను శారదకు పరిచయం చేయటానికి ఉపక్రమించినది ఉమ.

''వాత్తేరులో మా పెద్దమ్మగారు లేరూ...వాళ్ళ సుపుత్రుడు మిష్టర్... 'కృష్ణ'..వుడ్ బి మాస్టర్ ఆఫ్ సైన్సెస్. ఒరేయ్ కృష్ణుడూ ! ... ఈ అమ్మాయి నా చిన్నప్పటి ఫ్రెండురా...మన వూరి




"ప్రాక్టీసు బాగానే ఉంటోందిలెండి. మా యింట్లోనే అంతకుముందు నెలనెలా వంద రూపాయలు డాక్టరుఫీజుకు ఖర్చవుతుండేది. ఇప్పుడదంతా మిగులుతోంది"

---

ప్రెసిడెంటుగారి చుట్టం ... పేరు ... శారద...''

"హల్లో, హౌడుయుడూ ?..." అలవాటు ప్రకారం చెయ్యి ముందుకు పోనిచ్చి ఓ అరక్షణం తర్వాత చేతులు జోడించి 'నమస్తే' అని పళ్ళికిలిద్దామనే సదుద్దేశంతో, చేతులను వెనుకకు తీసేసుకోబోయాడు కృష్ణుడు.

"హల్లో ... హౌడుయుడూ !...'' ఏమాత్రం సంకోచించినట్లు మొహం పెట్టకుండా కృష్ణుడి చేతికి చేయి అందిచ్చి 'షేక్‌హ్యాండ్' పుచ్చుకున్నది శారద, మందస్మిత వదనారవిందంతో.

'నైస్ గర్ల్!...' మనస్సులో అనుకున్నాడు కృష్ణుడు.

''అది!...చదువుకున్న సభ్యత! అనుకున్నది ఉమ

"చదువుకుంటున్నా రనుకుంటాను.." ప్రక్కకు చూస్తున్నట్టు నటిస్తూ అడిగాడు కృష్ణ.

"అవునండి ... బియ్యేస్సీ...రిజల్ట్స కోసం ఎదురు చూస్తున్నాను..." చిరునవ్వుతో జవాబిచ్చింది శారద

"ఏయ్ శారూ! రావే మా అమ్మకి కన్పడుదూగాని..." శారద చేయి పట్టుకొని అన్నది ఉమ

"ఇప్పుడే వస్తానండి..." అంటూ ఉమను అనుసరించింది శారద

ఇంకేం! ఒంటరిగా కూర్చున్న కృష్ణుడి మనస్సులో ఆలోచనలు పరుగెత్తాయ్!

"అదన్నమాట పరిస్థితి! ... శారద తన పిన్నిగారమ్మాయికి స్నేహితురాలు. మరి తనకు?...'అమ్మాయిగోరు'. .' లవ్లీ!...కాని ఇప్పుడెలా?. .మళ్ళీ ప్రారంభం చెప్పించుకుందుకు వెడితే తనను ఆనమాలు కడుతుందేమో! . ఆఁ... మనిషిని పోలిన మనుషు లెందరుండరు? ఇంతవరకు ఆట బాగానే సాగింది గనుక దీనికి 'ది యెండ్' బోర్డు త్వరలోనే కట్టేయాలి.. సరే..." ఏవేవో ఆలోచనలు, ప్లానుతో ఓ అరగంట అతికష్టం మీద గడిపాడు కృష్ణుడు.

"అంతేనే,...మళ్ళీ వస్తాగా...కాని చూడు...వీలైనప్పుడు తప్పకుండా మా పెదనాన్న గారింటికి వచ్చేయాలి:..... ఊఁ?..." ఉమతో అంటూ, కృష్ణ కూర్చున్న గది దగ్గరకు వచ్చింది శారద

"వెడతానండి మిస్టర్..కృష్ణగారూ!" శారద పలుకరింపుకు సమాధానం ఏ విధంగా ఇచ్చి, సంభాషణను పొడిగించాలో ఆలోచిస్తున్న కృష్ణ శారద మాట విని ఉలిక్కిపడ్డాడు

"అరె...అప్పుడే?...అయినా మీకీ వూళ్ళో ఎలా తోస్తున్నది చెప్పండి? .." కాలరు మీదుగా చేయి పోనిచ్చుకుంటూ అన్నాడు కృష్ణ.

"... ఏముందండీ! ... సాయంత్రమప్పుడు సర్దాగా ఈ గ్రామవాసులకు చదువు నేర్పిద్దామని మొన్నటి నుంచీ చెప్పటం ప్రారంభించాను...వీళ్ళు చాలా తెలివైనవారు సుమండీ..."

"మంచి ఉద్దేశమే!..." మొహం అదోలా పెట్టి ముక్తసరిగా అన్నాడు కృష్ణ.

ఇద్దరి దగ్గరా సెలవు పుచ్చుకుని బయల్దేరింది శారద, అలాగే చూస్తూ నిలబడిపోయాడు కృష్ణుడు

"ఏయ్...ఏమిటా పని?... తప్పు గదూ?..." విరగబడినవ్వుతూ అన్నది ఉమ.

*　　*　　*

"అమ్మాయ్‌గోరూ! ...ఆ అబ్బాయి గోరు ఈ చీటీ యిచ్చి రిమ్మన్నారండీ!" మర్నాడు పైర్రివేటు కొచ్చిన కిష్టయ్య శారద కో లెటర్‌ను అందిస్తూ అన్నాడు

"అరె...ఆయన నీకెలా తెలుసునోయ్?..." ఉత్తరం తీసుకుని క్రింద

సంతకాన్ని చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది శారద.

"...మంచోరేనండీ' ఆరింట్లో వాడుగ్గా బండి కడుతుంటాను గదం డమ్మాయిగోరూ : ... యిందాకటు కేసి వస్తుంటే ఆ బాబుగారీ వుత్తరం మీకిచ్చి రమ్మన్నారండీ '..."

ఉత్తరం చదువుకున్న శారద ఓ రెండు నిముషాలు ఆలోచిస్తూ ఉండి పోయింది

"ఏటం డమ్మాయిగోరూ! అబ్బాయి గోరు అందులో ఏటి రా సేరు ?..." అడిగాడు కిష్టయ్య

"అబ్బే ... నీకు ... బాగా చదువు చెప్పమని వ్రాసేరు..." ఉలిక్కిపడి సమాధానం ఇచ్చింది శారద

"యేటోనండి ... వొచ్చి రెండ్రో జులైనాది...ఆ బాబుగారికి నేనంటే మా చెడ్డ అభిమానమం డమ్మాయి గోరూ!..." తలగుడ్డను సరిచేసుకుంటూ అన్నాడు కిష్టయ్య

కిష్టయ్య వైపు శారద దీక్షగా చూసింది... "అరె '... ఉమా వాళ్ళ కృష్ణ పోలికలు ఇతనిలో చాలా ఉన్నవే ! ... అదే పొడుగు ... అదే వాటం ... అబ్బా ... అంతా ఒకటే... ఉహూ...కాని...అతనికీ ఇతనికీ ఎంత తేడా ! ... అది చదువు మూలంగానే గదా !..."

"అదేటండమ్మాయిగోరూ !...అట్టా సూత్తుండారు?" ఆలోచిస్తూ తనవైపు చూస్తున్న శారదను. సిగ్గుపడుతూ ప్రశ్నించాడు కిష్టయ్య.

"అబ్బే ... ఏం లేదు ... చూడు కిష్టయ్యా...నీకు 'పేర్లు' వ్రాసిస్తాను... ఇంటికి పోయి దిద్దుకో...రేపటి నుంచి పుస్తకం చదవటం ప్రారంభిద్దూగాని... ఊఁ?...ఇవ్వాళ నాకు ఒంట్లో అంత బాగోలేదు...మళ్ళీ రేపు చెపుతా..."

"అదీ పరిస్థితి! అబ్బాయిగోరి వుత్తరం చూసేసరికి అమ్మాయిగోరికి ఒంట్లో తలపో టొచ్చింది!..." అను కున్నాడు కిష్టయ్య మనస్సులోనే నవ్వుకుంటూ.

పేర్లు వ్రాసిచ్చి లోపలికెళ్ళిపోయింది శారద. "దండా లండీ..." అంటూ వచ్చేశాడు కిష్టయ్య.

* * *

"ఒరేయ్ సింహాద్రీ...నా కిర్రుచెప్పు లేవిరా?..." మర్నాడు నాలుగు గంటల ప్రాంతానికి పైరివేటుకు వెడదామని తన గదిలో డ్రెస్ చేసుకుంటున్న కృష్ణ అడిగాడు

"ఉండం డబ్బాయిగోరూ : మన గిత్తని కట్టిన పాకలో పెట్టినాను..." అంటూ పెరటివైపు వెళ్ళాడు సింహాద్రి,

బనీను, పంచె ధరించటం పూర్తిచేసి తలగుడ్డ కట్టుకుంటూ అద్దంముందు నుంచున్నాడు కృష్ణ.

దగ్గరగా వేసున్న గది తలుపులు కిర్రు మన్నాయ్...

"అరె...ఎవరూ?.. కిష్టయ్యా?..." ఎగా దిగా చూసింది శారద కృష్ణని.

"అవునండమ్మాయిగోరూ ! కిష్ణబాబు గారు నన్నిక్కడ కూచోమని ఆ పక్క గదిలో కెళ్ళారండీ !... ఉండండి... పిలుసుకొస్తాను..." అంటూ బయటకి వెళ్ళి ప్రక్కగదిలోకి దూరాడు కృష్ణ

"అరె...చేతికి రిస్టువాచ్ !...కాళ్ళకు బాత్‌రూమ్ స్లాండల్స్ !!...ఏమిటిది? . కృష్ణ గదిలో కిష్టయ్య!!...స్...ఐ సీ... అన్నట్టు ఇతను ఆయనగారి 'మెస్సెంజెర్' గదూ...అందుకునే గామోసు ఈ చొరవ_కాని...చూస్తుంటే...'' ఇంకా అనుమానంగా ఆలోచించనీయకుండా ఉమ మాట అడ్డొచ్చింది — "ఎవరూ!. శారదా!...అదేమిటే ?...తిన్నగావచ్చి అన్నయ్య గదిలో దూరేవ్ ?...ఏమిటి సంగతి? ...ఇంతకీ అన్నయ్యేడి?" అదోలా నవ్వుతూ కళ్ళు చికిలించింది ఉమ.

"అబ్బే ... ఇప్పుదే ఎచ్చేను... నేనిలా వచ్చేను, మీ బండి కిష్టయ్య అలా గదిలోకెళ్ళాడు...ఒక్క అర .."

"ఏమిటి ?...బండి కిష్టయ్యా ? ... ఎవరిది?...అసలు నువ్వేం మాట్లాడుతున్నావే ?" శారదకు అడ్డుతగిలి గంటకు వెయ్యిమైళ్ళ స్పీడుతో ఆశ్చర్యంగా అడిగింది ఉమ.

"ఇయిగోనండీ కిష్ణబాబుగారూ మీ కిర్రు సెప్పులు ... యిక నడండి మరి ... బండి కట్టేశా ...'' అంటూ గదిలోపలికి వచ్చిన సింహాద్రి ఒక్కసారి నోరు వదిలేసి గుడ్లప్పగించి నిలుచుండి పోయాడు

"ఏమిట్రా సింహాద్రీ ? ... ఏమిటీ సంగతి ? కిష్ణబాబేమిటి ? కిర్రుచెప్పులేవిటి?...చెప్పు!!" గద్దించింది ఉమ

"అ...బ్...బ్...బ్బే...లేదండమ్మాయిగోరూ !...మరి...మరే..." వణికేడు సింహాద్రి

"ఏమిట్రా అలా ఒణుకుతున్నావ్? సరిగ్గా చెప్పు...'' కసిరింది ఉమ

పరిస్థితి అర్థంకాక గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయింది శారద

"మరేనండి...మన కిష్ణబాబుగారు . మొన్న ... యేం ఊసుపోలేదురా సింహాద్రీ ... బండి దోల్తాను ... అని బండేసుకుని. " అప్పటినుంచి ఈక్షణం వరకు జరిగినదంతా పూసగ్రుచ్చినట్టు చేప్పేసేడు సింహాద్రి

నవ్వలేక కూర్చుండిపోయింది ఉమ. కిష్టయ్య వేసిన టోపీలో పడినందుకు ఉడుక్కుంటూ బుంగమూతి పెట్టింది శారద

"ఏమిటే...అంత హుషారుగా నవ్వుతున్నావ్?...ఎవరూ శారదా?... ఎంతసేపయిందమ్మా వచ్చి?..." కాఫీ తెస్తూ అన్నది ఉమా వాళ్ళఅమ్మ.

ఇంకా గట్టిగా నవ్వుతూ 'కృష్ణలీల' లను గురించి అమ్మతో చెప్పింది ఉమ.

''అయితే ఇంతకీ కృష్ణ ఏడీ?..... అడిగింది ఉమావాళ్ళ అమ్మ.

"అదిగో ... ఆ గదిలోకి వెళ్ళేడు బండి కిష్టయ్య..." కోపంగా చూస్తూ అన్నది శారద.

"మా శానా గట్టి నాటకమాడేరండీ... కిష్ణబాబుగారు'' తనదేం తప్పులేదన్నట్లు చూస్తూ అన్నాడు సింహాద్రి.

*　　*　　*

"ఒరేయ్ పెద్దమ్మకొడుకూ! తలుపులు తియ్యరా ... శారద వెళ్ళిపోయింది'..." గది తలుపులు బిడాయించుకుని బయటికి రావడానికి భయపడ్తున్న కృష్ణకి వినిపించేటట్టన్నది ఉమ

''ఏమీ వెళ్ళలేదు ... ఇక్కడే ఉన్నాను. ఇంకా ఓ రెండు గంటలదాకా వెళ్ళబోనుకూడా'' పంతం పడుతున్న ధోరణిలో అన్నది శారద.

''ఒరేయ్ కృష్ణుడూ!...అర్ధమయింది రా నీ ఐడియా...రా ... బయటికిరా... నీకేం పర్వాలేదు...నే నున్నానుగా...'' హామీ ఇచ్చింది ఉమ

తలుపులు మెల్లగా తెరుచుకున్నయ్'

''హల్లో మిస్ శారదా! ... హౌడు యుడూ?" ఈసారి లోపల్నుంచి నీటుగా తయారైన అసలు 'నిజంకృష్ణ' బయటికి వచ్చి నవ్వుమొహంతో శారదను విష్ చేశాడు.

''హో...బండి కిష్టయ్యా!...నీకు ఇంగ్లీషుకూడా వచ్చునే! ... ఊఁ?... కృష్ణకీ, కిష్టయ్యకీ అదన్నమాట సంబంధం?...'' అన్న శారదమాటలు విని ఫక్కున నవ్వింది ఉమ

"చూశావా అమ్మా! అసలుసంగతి అర్ధమైందిగదూ?...ఇప్పుడే పెదనాన్న గార్కి ఓ ఉత్తరం వ్రాసేయ్...రావే శారూ'...ఓహ్...కాబోయే..."

"ఊఁ ఊఁ...నువ్వలాగంటావని నాకు ముందే తెలుసున్లే...నడు మా యింటికి పోదాం ...'' ఏదో అనబోతూ వరస కలుపబోయిన ఉమను ఆపుజేస్తూ అన్నది శారద.

''అరె...అమ్మాయిగోరూ!...బండి పెట్రమ్మంటారేటి? ... '' ఆనందంగా చూస్తూ అడిగాడు సింహాద్రి. కథ సుఖాంతమయ్యే సూచనలు కన్పడేసరికి

*　　*　　*

''ఊఁ ఎక్కండమ్మాయిగోరూ!. మా యిశాఖపట్నమంతా ఊరికే సూపెడతాను'..." స్కూటర్‌ను స్టార్ట్‌చేస్తూ అన్నాడు కృష్ణ

"అదికాదోయ్ కిష్టయ్యా!...ఇకనీకు మాత్రం ఊరికే చదువు చెప్పేదిలేదు.." వెనకాల కూర్చుంటూ 'కిలకిల' నవ్విన శారద నోటికి 'గలగల' మంటూ చేతి గాజులు పోటీకొచ్చినయ్... స్కూటర్ తుర్ర్... మన్నది

★